25—8—82



# వెన్నెలవేడి వడగాలి

జయంతి వెంకట రమణ

**అందాన్ని** నిర్వచించమంటే ఎవరికైనా కష్టమే శ్రీరామమూర్తి లాంటి సామాన్యుడికి మరీను.

కాని అందం అంతా ఒకచోట కుప్పపడితే, ఆ అందం రూపేమిటో అతనికి తెలుసు. కారణం— అతడీ మధ్యనే ఆమెను చూశాడు కనుక.

గులాబి పువ్వులో అందముంది.

సాయంకాలపు మబ్బుల్లో అందముంది.

ఇంద్రధనువులో అందముంది.

నెమలి నాట్యంలో అందముంది.

కాని ఈ అందాన్ని చూడాలి అంటే కాస్త కూస్త ఆ దృష్టి కావాలి. అతడు భావుకుడై ఉండాలి.

కాని శ్రీరామమూర్తి సామాన్యుడు.

అతడికి తెలిసిందల్లా అందమంతా స్త్రీ పరమనే! ప్రబంధ కవులతో సైతం అనాదినుండి ఈనాటి వరకు స్త్రీలో అందాన్నే చూశారు. అందంగానే వర్ణించారు.

అనాకారి అయిన స్త్రీ కావ్య నాయికగా ఎక్కడుంది! కనుక స్త్రీని వదలి శ్రీరామమూర్తి మాత్రం అందం ఇతరత్రా ఎక్కడ చూడగలడు?

అసలు ఆమె అతనికి కనిపించకపోతే—"అబ్బా! ఎంత అందంగా ఉంది? అసలు అందమంటేనే ఇది కాబోలు" అనే వాక్యం తమసా నదీ తీరాన నిలిచిన వాల్మీకి నోటి వెంట వచ్చిన శ్లోకంలా వినిస్తుంది?

ఈమె అందాన్నెలా వర్ణించటం!

మెరుపుల ప్రోగా?

వెన్నెల కుప్పా?

బంగారపు ప్రోవా?

ఏదో తెలియటం లేదతనికి.

సిటీ బస్సులో ఆమె ఎక్కిన క్షణం నుండి అందరూ చూస్తున్నట్టే తనూ చూస్తున్నాడు మైమరచి.

ఆమె చుట్టూ ఏమిటా కాంతి వలయం! ఆకర్షణ కిరణాలు! విద్యుదయస్కాంత కాంతివలయాలా?

సిటీ బస్సులో కూర్చోటానికి (ఆమెకీ) ఎక్కడా స్థలం లేదు. ఆమెలాగే చాలామంది మగ, ఆడ నిలబడి ఉన్నారు. మగవారి హృదయాలు ఆమెకై సానుభూతిని చూపుల్లో చూపిస్తూ బాధపడుతూంటే, స్త్రీ హృదయాలు నిబ్బరంగా నిట్టూర్పు విడిచాయి.

ఆమె శ్రీరామమూర్తి సీటుకి దగ్గరగా నిల్చుంది.

శ్రీరామమూర్తిది సింగిల్ సీటు.

ఆమె అంత దగ్గరగా నిలబడగానే అతని మనసేమిటో అయింది.

హిప్నటైజ చేయబడిన మనిషిలా ఒక్క ఉదుటున సీటులోంచి లేచాడు. "కూర్చోండి" అన్నాడు గొంతు పెగల్చుకుని.

ఆమె తల ఎత్తి, కనురెత్తి కృతజ్ఞతా పూర్వకంగా చూస్తూ, చిరునవ్వు నవ్వుతూ 'థాంక్స్' అంది.

ఆమె కూర్చుంటుంటే ఆ పని చేయలేని మగవారు తమను తాము నిందించుకుంటూ శ్రీరామమూర్తినే ఈర్ష్యగా చూస్తూంటే, శ్రీరామమూర్తి ఆనంద శిఖరాల నధిరోహించినంత సంబర పడిపోయాడు.

ఎన్నో స్టాపులొచ్చి వెళ్ళిపోతున్నాయి. అతడామెనే చూస్తున్నాడు. ఆమెకు ఎవరూ తగలకుండా ఉండేందుకు మగవారికీ, ఆమెకీ మధ్య అడ్డుగా నిలిచాడు. "టిక్కెట్ ప్లీజ్!" అన్నప్పుడే జేబులోంచి అందిన నోటిచ్చి రెండు మూడుసార్లు తను దిగవలసిన స్టాపు తప్పు చెప్పి, చివరికి సరిచేసుకుని అతనిచ్చిన టిక్కెట్ పుచ్చుకు, చిల్లర జేబులో వేసుకున్నాడు.

ఏదో స్టాపులో బస్సు ఆగబోతూంటే, బొట్టలా

ఉన్న చీరకుచ్చిళ్ళను సవరించుకుంటూ ఆమె లేచి శ్రీరామమూర్తిని చూచి "కూర్చోండి, రండి" అంది అతని సీటును అతనికే అప్పగిస్తూ. శ్రీరామమూర్తి కూర్చోబోతూ, తనూ ఆ స్టాపులోనే దిగాలని గుర్తు తెచ్చుకుని, ఎవరో అమ్మాయి తన్ను రాసుకుని ఆ సీటుకు ఎగబడుతూంటే ఆమె వెనుకే దిగి పోయాడు.

రోడ్డంతా రద్దీగా ఉంటే ఆమె రెండో వేపుకు పోవటానికి ఆగింది. అతను ఆగి రోడ్డు క్రాస్ చేస్తూంటే, ఆమె అతని వెనుకే నడిచి అతన్ని తలుసుకుని అతనితో నాల్గడుగులు వేసింది. ఆమెతో కలిసి అడుగులు వేయటం అతనికి గిలిగింతలు పెట్టినట్టుంటే ఒకసారి పక్కకు తిరిగాడు. ఆమె చీర కుచ్చిళ్ళను దగ్గర చేసుకుని, అతన్ని దాటి పోతుంటే కాలిమెట్టెలు తళుక్కుమన్నాయి. అతని మనసు కలుక్కుమంది.

'ఈమెకు పెళ్ళయిందా?'

అతని మనసు మూలిగింది.

తనకూ పెళ్ళయిందిగా!

తన అర్థాంగి కాలిమెట్టెలు గుర్తు చేశాయి. అయినా అందాన్ని ఆరాధించటంలో తప్పేముంది?

అంతే! ఆ క్షణంనుండి ఆమె ఎడ అతనికి ఆరాధనా భావం, గౌరవ భావం కలిగాయి.

"ఆమె ఎంత అందంగా ఉందో తెలుసా? రంభ, ఊర్వశి అంటారు గాని వాళ్ళు గూడా ఆమె కాలి గోటికి పనికి రారనుకో!" భోజనాలయి బాబిగాడు నిద్రపోయిన తరవాత అన్నాడా రాత్రి భార్యతో శ్రీరామమూర్తి.

ఆమె అతనివేపు 'ఏమిటీ పైత్యం' అన్నట్టు చూసి, "సరేలెండి. ఆ కథల కామరాజుకి చెప్పండి. కథేమన్నా రాస్తాడు. నాకు నిద్రొస్తూంది" అంటూ అటుతిరిగి పడుకుంటే, శ్రీరామమూర్తి ఆమె గురించే ఆలోచిస్తూ తెల్లవారు ఝామున ఎప్పుడో నిద్రపోయాడు.

భార్య నిద్ర లేపుతూంటే ఆమె తన్ను మేలు కొలుపుతూందన్న భ్రాంతిలో కళ్ళు తెరిచాడు.

ఆఫీసులో కూడా ఆమె చుట్టే ఆలోచనలు.

ఆమె కనిపిస్తుందేమోనని అవసరమున్నా, లేక పోయినా సిటీ బస్సు ఆ పది రోజులూ ఎక్కాడు.

మరో పది రోజులూ గడిచాయి.

ఆమె కనిపించలేదు. ఆమె దిగిన బస్సుస్టాపులో రెండు మూడు రోజులు నిఘా వేశాడు కూడా.

అయినా ఆమె కనపడలేదు.

ఇక ఆమె కనిపించదేమో అన్నంతలో ఒకనాడు సాయంత్రం సూర్యంతో వేసుకున్న సినిమా ప్రోగ్రాము అతను రాకపోవడంతో విఫలమవగానే, కసితో అడ్వాన్సుగా కొన్న టిక్కెట్లను చూస్తూ గేటు దాటి ఇవతలకి వచ్చేంతలో ఆటోలో హడావుడిగా దిగి, హౌస్‌ఫుల్ బోర్డు చూసి దిగాలుపడి బ్లాకులో టిక్కెట్లమ్మే వాళ్ళకోసం అటు, ఇటు పరికిస్తున్న ఆమె కన్పించింది.

శ్రీరామమూర్తి మనసు పొంగిన పాలకడలైంది.

ఒడ్డును తాకాలని ఆరాటపడే అలలా ముందుకు దూసుకుపోయి, తెల్లని షిఫాన్ చీరలో మెరిసి పడే ఆమెను మరింత ఆనందోత్సాహంతో చూచి "హలో!" అన్నాడు.

ఆమె అతని వంక తిరిగి "హలో! మీరా!" అంది. కాని ఆమె తన్ను గుర్తు పట్టలేదని శ్రీరామమూర్తికి తెలిసిపోయింది.

"మరచిపోయారా! సిటీ బస్సులో..."

"అవునవును... సిటీ బస్సులో... టిక్కెట్లు... హౌస్‌ఫుల్..."

"అవును, హౌస్‌ఫుల్—సినిమా కొచ్చారా?" అన్నాడు.

లిక్కర్ షాపులో చూసి కాఫీ కొచ్చావా? అన్నంత వెధవ ప్రశ్న వెయ్యటం చేతకాక! నిజానికి ఇలాటి ప్రశ్నలు వెయ్యక తప్పదు.

"అవునవును...హౌస్‌ఫుల్...టిక్కెట్లు..." ఆమె కలవరిస్తున్నట్టు అంది.

"నేనూ సినిమాకనే వచ్చాను. మా ఫ్రెండు రాలేదు. తిరిగి పోదా మనుకుంటున్నాను. బైదిబై, నా దగ్గర రెండు టిక్కెట్లున్నాయి. మీ కభ్యంతరం లేకపోతే—ఐ మీన్—నాకు కంపెనీ ఇవ్వడానికి—రండి, వెళ్దాం" అన్నాడు ఏకబిగిని.

"థాంక్స్... మెనీ మెనీ థాంక్స్ ఇంకా నెమ్మదిగా అంటున్నారా! పదండి. అన్నట్టు ఇది తీసుకోండి" అంటూ ఆమె పర్సు తెరవబోయింది.

"మీ రలాటి పని చేస్తే ఈ టిక్కెట్లిక్కడే చింపేసి నా దారి నే పోతాను" అన్నాడు

"గొప్ప ఇబ్బందిలో పెట్టారే" అని ఆమె అంటూండగా బెల్ మోగింది.

"పదండి" అన్నాడు.

ఆమె కదులుతూంటే ఆమెతో పాటు మెత్తని కార్పెట్ మీద అడుగులేస్తూ నడిచాడు. ఆమెను తాకినంత మెత్తగా మనసు కనిపిస్తూంటే డ్రెస్ సర్కిల్ లోకి నడిచాడు. ఆమె శరీరం మీద నుండి ఇంటిమేట్ సెంట్ మనసును పరవశింప జేస్తూంటే, ఆమె ఎవరో కాదు అన్నంత సమీపంగా నడిచాడు శ్రీరామమూర్తి.

'చెదిరిన మేఘాలు' సినిమా విడుదలైన రెండవ రోజు. హాలులో కూర్చున్న ప్రతి ఒక్కరూ లోకాల్ని జయించిన వీరుల్లా, కొత్త లోకంలో సంచరిస్తున్న గంధర్వుల్లా ఉన్నారు.


తెర లేస్తూంటే, తెరముందు ప్రేక్షకులు ఈలలు కొడుతూంటే, అభిమాన సంఘ సభ్యులు తమ నాయకుని పేరు చూట్టానికి వెర్రెక్కిపోతూంటే ఆమెకి సీటు చూపించి ఆమె పక్కనే కూర్చున్నాడు.

"నీ గదికి మూడుసార్లు వచ్చాను... ఒకసారి యుద్దనపూడి నవల తెచ్చాను... ఇంకోసారి అమృతాంజనం తెచ్చాను. మరోసారి మాటాడదామని వచ్చాను. ఇదంతా ప్రేమ కాక మరేమిటి? నన్నెక్కడికైనా లేవదీసుకుపో" అని హీరోయిన్ హృదయాన్ని విప్పి (ఆ క్షణంలో ఆమె పైట జారిపోయింది) అడుగుతూంటే, యువతరానికి దర్శకుడు ఎంతటి సహాయం చేశాడు? ఇక ప్రేమను ప్రదర్శించటానికి కష్టపడనక్కర లేదని మీసాలు మొలవటం ప్రారంభించిన మగపిల్లలు, వోణీలు వెయ్యటం ప్రారంభించిన ఆడపిల్లలు సంబర పడిపోతూంటే, 'ఈ పువ్వును ధరిస్తే నీవు నన్ను ప్రేమిస్తున్నట్టే—చెప్పు' అని మరో సన్నివేశంలో ఈ కథానాయకుడే మరో హీరోయిన్‌ని అణాపైసలతో లెక్క తేల్చమంటూంటే తెర వెల్లబోయింది. దీపాలు వెలిగాయి.

అది ఇంటర్వెల్...

కథానాయకుడు ఎవరిని పెళ్ళి చేసుకుంటాడో తెలీదు. అందరి ముఖాలలో ఆందోళన. ఆమె ముఖంలోనూ అంతే. కాని శ్రీరామమూర్తి సినిమా చూడటం లేదు. ఆమెనే చూస్తున్నాడు. ఆమె అందాన్నే తనివితీరా చూస్తున్నాడు.

"లాస్టుకి ఏమవుతుందో? నవల్లో అయితే రచయిత్రి ఇద్దర్నీ చంపేసింది. మరిందులో ఏం జరుగుతుందో! అంతా సస్పెన్సు. బాగా నడుపుతున్నాడు కదండీ" అని ఆమె ఒళ్ళు విరుచుకుని అంటూంటే, చీర జారిపోయిన ఆమె గుండెనే చూస్తూ 'బాగుంది' అన్నాడు శ్రీరామమూర్తి. ఆమె అతని చూపును గమనించలేదో, గమనించిందో అతనికి తెలీదు.



శ్రీరామమూర్తి రెండు 'థమ్స్ అప్' తెచ్చి ఆమె కొకటి అందించి తానూ కూర్చుని సిప్ చేయటం ప్రారంభించాడు. ఆమె కబుర్లు చెప్తూంటే సినిమా మొదలైంది.

సీసాలు తిరిగి ఇచ్చేసి వచ్చేసరికి కథానాయకుడు క్లబ్‌లో ఉన్నాడు. క్లబ్ డాన్సర్ రంగు దీపాల మధ్య 'ఈ బట్ట నీ కెందుకు? నీ చుట్టూ నే నుండగా' అని కథానాయకుడు పాడుతూండగా, బట్టలు చాక చక్యంగా విడుస్తూ డాన్సు చేస్తూ రంగు పేలికల మధ్య శరీరాన్ని దాచుకోటానికి ప్రయత్నిస్తూంటే, రంగు దీపాలు కళ్ళను చెదరగొట్టేటట్టుగా వెలుగుతూ ఆరుతూంటే, మీసాల విలన్ ఆమె మీదికి దూకటంతో పాట ఆగిపోయింది. క్లబ్ డాన్సర్ కెవ్వున కేకవేసి కథానాయకుని వాటేసుకుంటూంటే, హీరో ఆమె మీదికి తన కోటును విప్పి విసిరి విలన్ మీదికిలంఘించాడు. కొద్ది సేపుతెరమీద చప్పుళ్ళు... హాలులో ప్రేక్షకుల ఈలలు. విలన్ తోక ముడిచి పారిపోయాడు.

క్లబ్ డాన్సర్ ఒంటినిండా చీర చుట్టుకొని, భుజం మీదికి చీరకొంగు లాక్కుని కన్నీటితో తన కాటుక కథను వినిపిస్తూంటే, 'నీకేం భయం లేదు. నీవు నా చెల్లి లాంటి దానివి' అని హీరో ఆమెను బిగియార కౌగలించుకుని ఓదార్చుతూంటే, లతాంగి పువ్వును సిగను ధరించి వాడనీకుండా రెండు రీళ్ళు నుండి కాపాడుకుంటూ వచ్చి హీరో కౌగిట్లోని క్లబ్ డాన్సర్‌ని చూచి ఆవేశంతో కారెక్కి వెళ్ళిపోతూంటే శ్రీరామమూర్తి సీటులోంచి లేచిపోయాడు. ఆమె శ్రీరామమూర్తిని గమనించలేదు. 'నేను వెళ్తున్నాను. మీరు సినిమా చూచి రండి' అని చెప్పి త్వరత్వరగా ఇవతల పడ్డాడు. అతని మనసంతా చెదరిపోయింది.

'ఈమె కూడా అందరి స్త్రీల లాగ తోటి స్త్రీ నగ్న శరీరాన్ని నిస్సంకోచంగా చూస్తోందేమిటి? ఇలాటి దృశ్యాల మీద ఆడవాళ్ళు తిరగబడరెందుకు? ఈమెనేనా తను ఆరాధిస్తున్నాడు ...' అని అనుకుంటూ ఇల్లు చేరాడు శ్రీరామమూర్తి.

మరి రెండు రోజులకే అనుకోకుండా ఆమె షాపింగ్ సెంటర్ నుండి వస్తూ గేటు దగ్గరే కనిపించింది. ముందు ఆమే పలకరించింది.

"సినిమా మధ్యలోనే లేచి వెళ్ళిపోయారేం?" అని అడిగింది.

"తలనొప్పి వచ్చి" అన్నాడు సన్నగా నవ్వుతూ.

"అబద్ధం. అంత క్రితం పదిహేను నిమిషాల వరకు బాగానే ఉన్నారుగా" అంది కొద్దిగా ముందుకు కదలి.

"పదే పదే మీ భుజం, చేతులు తగులుతూంటే తెరమీద డాన్సర్ బట్టల త్యాగం చేస్తూంటే చూస్తూ నిగ్రహించుకోలేక లేచిపోయాను" అని చెప్పడానికి సంకోచిస్తూ "నిజం అంతే. మీరు కనిపిస్తే చెప్పాలనే అనుకుంటూంటే మీరే కనిపించారు—అడిగారు" అన్నాడు.

"రండి, కాఫీ తాగుదాం" అని ఆమె అంటే కాదనలేక వెనుతిరిగాడు. ఇంతలో ఎవరో పిలుస్తూంటే ఆగాడు. ఒక పదహారేళ్ళ కుర్రాడు పరుగెత్తుకుంటూ వచ్చి "మేడమ్, మీరేగా మా షాపులో బ్లవుజు పీస్ కొన్నది" అని అడిగాడు.

"ఆఁ! ... అవును ... ఏం?" అందామె.

"మా ప్రొప్రయిటర్ మిమ్మల్నొకసారి రమ్మన్నారు."

"నేనా? ఎందుకు? ... నాతో ఏం పని?"

"నాకు తెలీదు ... ఒకసారి రండి" అన్నాడు పట్టుదలగా.

ఆమె కదలటానికి ఇష్టపడటం లేదు.


"పోనీ వెళ్దాం." అన్నాడు శ్రీరామమూర్తి!

ఆమె అయిష్టంగా కదిలింది

ప్రొప్రయిటర్ ఎదురొచ్చాడు.

"మీరు నూరు రూపాయల నోటిచ్చారనుకుని పత్తొంబగు పోనూ ఎనభై ఆరు రూపాయలిచ్చాను. మీ రిచ్చింది యాభై రూపాయల నోటే. ఒక్కసారి చూడండి" అన్నాడు.

"ఏమీ చూడ నవసరం లేదు. మీరు ఎనభై




ఆరివ్వటం నిజం. కాని నేను హండ్రెడ్ రుపీస్ నోటు ఇచ్చాను. చూసుకోండి ఒకసారి."

"నో, మేడమ్! మీరు ఫిఫ్టీయే ఇచ్చారు. దాన్ని కలిపి ఇంకా ముప్పయ్యారు ఎక్స్ట్రా ఇచ్చాను."

"నో! ఐ గేవ్ యూ హండ్రెడ్."

"నో! యూ గేవ్ మీ ఫిఫ్టీ వోన్లీ."

శ్రీరామమూర్తికి వింతగా ఉంది. ఇంకా ఎక్కువైతే జనం చేరేటట్టున్నారు. శ్రీరామమూర్తి కలగ జేసుకున్నాడు.

"శేఠ్ గారూ! మీరు కేష్ మీ బిల్సుతో చెక్ చేసుకోండి. ఏమైనా తేడా వస్తే నాది పూచి. ఇది నా అడ్రెస్. నేను రాత్రి ఎనిమిదిన్నరకు మళ్ళా మీ షాపుకొస్తాను" అని చెప్పి అడ్రెస్ ఇచ్చి ఇవతల పడ్డాడు ఆమెను తీసుకుని.

కాఫీ హోటల్లో అడుగు పెడుతూ "అసలేం జరిగింది?" అని అడిగాడు.

"హి ఈజ్ బ్లఫింగ్. నేను నూరే ఇచ్చాను. అసలు మీ రెందుకు పూచీ పడడం? వాళ్ళు ఎకౌంట్స్ సరిగా చూడకపోతే ఆ తేడా మీరే ఇస్తారా? మన మెలా బాధ్యులం?" అందామె.

"కంగారు పడకండి. అనవసరంగా నేను మాత్రం ఫిఫ్టీ ఎందుకిస్తాను? రాత్రి వెళ్తాను కదా. అప్పుడా పరిస్థితిలో నుండి బయటపడడానికి అంతకన్నా వేరే మార్గం కూడా లేదు" అన్నాడు.

కాఫీ బిల్ ఆమె పే చేసింది.

ఆ రాత్రి శ్రీరామమూర్తి షాపు కెళ్ళాడు.

'అందం అబద్ధమాడుతుందా! తన ఆరాధన వ్యర్థమేనా? కామించి అనుభవించ దగిన సామాన్య స్త్రీ లాంటి దేనా ఈమె' అనుకుంటూ వెళ్ళాడు.

"ఇంతవరకు సేల్సుతో బిజీగా గడిచింది, సార్! షాపు కట్టేసే వేళయింది. ఎకౌంట్సు చూడటం అవదు. ఏదైనా తప్పు నాదే. ఆమె నని ప్రయోజన మేమిటి? ఆమెమాత్రం ఫిఫ్టీయే ఇచ్చారు, సార్. నాకు బాగా గుర్తు. ఆమె పర్సు తెరిచి మొదట నూరు నోటు తీసి తరవాత ఫిఫ్టీ నోటు ఇచ్చారు. నా గుర్తులో నూరు నోటె ఉండిపోయింది. అదీ పొరపాటుకు కారణం. ఏమైనా మరి ఏదో ఖర్చయిందనుకుంటాను. క్షమించండి, సార్" అన్నాడు శేఠ్.

"పైసా పైసా లెక్కచూసే మీరు ఏభై రూపాయలు త్యాగంచేయటం నాకు వింతగా ఉంది." ఎత్తిపొడుపుగా అన్నాడు.

శేఠ్ గొంతు తగ్గించి "ఆమె మీ కే మవుతారు?" అని అడిగాడు.

"ఏమీ కాము. ముఖ పరిచయం. అంతే."

"అయితే వినండి..ఆమె అందాన్ని చూస్తూ నేనే ఏదో అయిపోయాను. అంతే! నేనేం చేస్తున్నానో నాకు తెలియులేదు."

ఆపిల్ కోస్తున్న చాకు కసుక్కున బొటన వ్రేలిలోకి దిగి రక్తాన్ని చిమ్మించిన ట్టయింది శ్రీరామమూర్తికి.

శ్రీరామమూర్తి అతన్ని చూసి జాలిగా నవ్వి— "ఇక ఈ వ్యాపారం మానేసి కృష్ణా, రామా అనుకోండి. ఈ వయసులో మీ కిదేం చాంచల్యం?

25--8--82




వస్తాను'' అంటూ తిరిగి వచ్చేశాడు.

'స్త్రీ అందం కనిపించని కత్తి లాంటిదా? పువ్వుల గుత్తుల్లో కరవాలా లుంటాయా? పాపం! శేఠ్ మాత్రం మోసపోయాడు' అనుకున్నాడు రాత్రి నిద్రరాని పడకమీద.

అందం అబద్ధమాడుతుందా?

అందం మోసం చేస్తుందా? నమ్మ శక్యం కాని దతనికి.

వారం రోజా లయిన తరవాత పనికుర్రాడు రాని కారణం చేత ఉదయం పాలబూత్ కెళ్ళి రావలసిన పని శ్రీరామమూర్తి మీద పడింది. ఉదయం బూత్ కెడుతూంటే ఆమె పాల పాట్లాలు పట్టుకుని వచ్చేస్తూంది. కొన్ని యుగాల తరవాత చంద్రోదయ మైనట్టనిపించిం దాతనికి. ''మీరా!'' అన్నాడు ఆశ్చర్యానందాలతో.

''ఆఁ! నేనే. మీ ఇల్లు ఇక్కడికి దగ్గరా?''

''ఆఁ!'' అంటూ ఇంటి నంబరు, గురుతులు చెప్పాడు. ''మరి మీరో?''

''నంబరు గుర్తు లేదు. లోపల రెండో లైను. కొబ్బరిచెట్ల డాబా. దిగి నెల అయింది. పనిపిల్ల రాకపోతే నేనే వచ్చా.''

''చాలా మంచిరోజు. మిమ్మల్ని చాలా రోజుల తరవాత చూసినట్టుంది. ఆ రోజేం జరిగిందో తెలుసా!''

''ఏ రోజు! అవునవును. ఏం జరిగింది?''కంగారుగా అడిగింది.

''శేఠ్ తప్పొప్పుకున్నాడు.''

''ఒప్పుకోక ఏం చేస్తాడు? మీరు నిలవదీశారు కాబట్టి లేకపోతే నడి బజారులో అవమానం చేసేవాడు. అస లిలాటి వాళ్ళను వదలకూడదు. పోలీసు కంప్లెయింట్ ఇచ్చి కేసు పెట్టాలి.'' ఉక్రోషంతో ఆమె పెదవు లదిరాయి. ముక్కుపుటాలు ఎగిరాయి. ముఖం ఎర్రబారింది.

''ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు. మాఆయనతో చెప్పుమనసు కాలేదు.'' ఆమె కళ్ళలో నీళ్ళు నిండాయి.

''ఛా! వూరుకోండి. న్యాయం గెలిచిందిగా'' అన్నాడు. అన్నాడు కాని తికమక పడ్డాడు—'శేఠ్‌దే పొరపాటా! ఈమె నిర్దోషి' అనుకుంటూ.

''వెళతాను. పిల్లల్ని కాన్వెంటుకి రెడీ చెయ్యాలి. ఎప్పుడైనా మా ఇంటికి రండి. మా వారిని పరిచయం చేస్తాను'' అందామె కదులుతూ.

ఆమె ముందుకు కదలగానే శ్రీరామమూర్తిలో ఆలోచన మెరిసింది. నేల మీద పది రూపాయల నోటు జార విడిచి వంగి అందుకుంటూ ''ఈ నోటు మీదా?'' అన్నాడు.

ఆమె వెనుతిరిగి అతను నోటు అందుకోవటం చూసి రెండడుగులు వెనక్కి వేసి వస్తూ చేతిలోని రుమాలును చూసుకుని ''అవును, నాదే. మీ కెక్కడ దొరికింది'' అంది ఆమె ఆత్రతగా.

''ఇక్కడే! మీరు మాటాడేటప్పుడు కింద పడి పోయి ఉంటుంది'' అన్నా డామె కందిస్తూ.

''థాంక్సండీ. మీవల్ల నా కెప్పుడూ ఉపకారమే జరుగుతూంది'' అన్న దామె నోటు నందుకుంటూ.

''నిజమే. మనుషుల వల్ల జరగాల్సినవి ఉపకారాలే కాని, అపకారాలు కావు. నేను దగాకోరుని, మోసగాడిని, వంచకుడిని అంటే అది నా తోనే పోదు. నా చుట్టూ ఉన్న సమాజాన్నే దగాకోర్లుగా, వంచకులుగా చేస్తుంది. నాలో చెడ్డతనం వందలాది మందిని చెడ్డవాళ్ళుగా చేస్తుంది. మంచితనం మాత్రం ఏ కొద్దిమందినో కాపాడుతుంది. వస్తానూ. మీకూ ఆలస్యమవుతూంది''అంటూ కదిలాడు శ్రీరామమూర్తి పాల బూత్ వేపు.

ఆ మరునాడు శ్రీరామమూర్తి ఆమె ఇంటిని వెతుక్కుంటూ వెళ్ళకపోతే ఈ కథ ఇక్కడితో ముగిసిపోయి ఉండేది. కాని శ్రీరామమూర్తి ఆ మరునాడు ఉదయం ఆమె ఇంటిని వెతుక్కుంటూ వెళ్ళి కొబ్బరిచెట్ల డాబా ముందాగాడు. గేటు తెరవబోతూ ఎవరి మాటలో పరుషంగా విన వస్తూంటే ఆగాడు.

''ఎంతసేపు తండ్రీ కొడుకులకి నా బట్టల మీద, నగలమీదే నా దృష్టి! నేనేం సుఖ పడి పోతున్నానని ఈ ఏడుపు? చెవిటివాళ్ళు చెవిటివాళ్ళుగా ఉండాలి. ఈముసలాయనకి చాకిరీ చేయటం కోసమేనా నే నున్నది? నాకూ నా పిల్లలూ, సంసారమూ ఉంది. నా ఇష్టమైంది పెడతాను. ఇష్టమైతేనే పెడతాను. తింటే తినమనండి. పోవాలనుకుంటే పొమ్మనండి. మళ్ళీ తిరిగి రాకుండా పొమ్మనండి. సినిమా, షోకులు అని నన్నంటారే కాని ఆయనగారి ముక్కుపొడుం, మీ సిగరెట్ లెక్క చెప్పరేం! నా ఇల్లు, నా సంసారం నా ఇష్ట మొచ్చినట్టు చేసుకుంటాను. అస లాయన ఈ ఇంటిలో ఉండడానికి వీల్లేదు. అదేదో ఈ క్షణాన్న తేలిపోవాలి. లేకపోతే మళ్ళీ తిరిగి రాకుండా నేనే మా పుట్టింటికి వెళ్ళిపోతాను. అలా బెల్లం కొట్టిన రాయిలా చూస్తారేం? చెప్పండి.''

అది కిన్నెర వీణ కాదు, తుమ్మెదల ఝుంకారమూ కాదు. కర్ణ కఠోర గార్దభ స్వరము. మండు టెండల్లో వూరిని తగల పెట్టే అగ్ని కీలల మధ్య నాట్యం చేసే గాలి రొద.

అది ఆమె గొంతుక.

శ్రీరామమూర్తి గుండె వెయ్యి వ్రక్కలయింది.

'ఆమె వస్తుందేమో! తన్ను చూసి మనసు మార్చుకుంటుందేమో' నని గేటు దగ్గర నిలబడ్డాడు. ఆమె రాలేదు. కాని ఒక రేకు పెట్టెను మోసుకుంటూ ఒక ముసలాయన ఇవతలి కొచ్చాడు. అతను మెట్లు దిగి కొబ్బరి చెట్ల నీడలో కొచ్చేసరికి ఒక యువకుడు పరుగు పరుగన వచ్చి అతని చేతులు పట్టుకుని ''ఎక్కడి కెళ్తావు, నాన్నా! మువ్వేళ్ళకు, నాన్నా'' అని సుమారు ఏడ్పే గొంతుతో అర్థిస్తున్నాడు. అతను దీనవువురుగు కన్న వేరే కాడు.

''నా వల్ల మీరు తగవులు పడకండిరా, బాబూ. మనూరికే పోతా. మనిల్లుందిగా, తల దాచుకోవడానికి చాలు. ఇక తిండా? ఏదో బాధ పడతాను. మీ అమ్మ అదృష్టవంతురాలు. నన్ను వెళ్ళనియ్యి.'' వణుకుతున్న చేతులతో పెట్టెను రెండో చేతిలోకి మార్చుకుంటూ అన్నాడు.

''ఎందు కలా బతిమాలతారు? వెళ్ళనీండి'' అంటూ వీధి వరండాలో కొచ్చిం దొక అగ్ని శిఖ— నేలమీద ధ్వనిచేసుకుంటూ,విరబోసుకున్న జుత్తుతో మొండి చేతులతో, బొట్టు లేని నుదుటితో, ఆచ్ఛాదన తొలగి ఆవేశపడి, ఎగసి పడే వక్షఃస్థలంతో, చూడటానికి అసహ్యంగా, ఈమె స్త్రీయేనా అనిపించేటట్టుగా.

ఆమె తన్ను చూస్తూండగా గేటు తెరుచుకుని లోపలికి నడిచి బిత్తరపోతూంటే, అతణ్ణి సమీపించి అతని భుజం తట్టి ''మీ నాన్నగార్ని నాతో పంపండి. నాకూ ఒక నాన్న ఉన్నారు. ఆయనకు తోడెవరూ లేరు. నాకూ, నా భార్యకీ, నా పిల్లలకీ రోజంతా పనితోనో, పుస్తకాలతోనో గడిచి పోతుంది. మరి మా నాన్న కలా కాదు. మరి తిండి అంటారా... మాతోపాటే. తల్లి తండ్రులు లేని పిల్లల్ని అనాథ లంటారు. కాని అందరూ ఉండి ఎవరూ లేని ఇలాటివాళ్ళ నేమనాలో నాకు తెలియదు. కాని మన కోసం అష్ట కష్టాలు పడి, సర్వం త్యాగంచేసిఅందరూ ఉండి, ఎవరూ లేనట్టయిన తల్లి తండ్రులను పెంచే బాధ్యత మనందరిది. రేపు మన పిల్లలు మనల్ని నిరాదరణ చేయకుండా చూడవలసిన బాధ్యత మనది. ఎవరూ లేని వృద్ధులకోసం ప్రత్యేకంగా శరణాలయా లుండటం అవసర మనిపించటం లేదూ?'' అని ఆమె వేపు తిరస్కార భావంతో చూసి, 'ఖరీదైన నాలుగు రంగు చీరలు ధరించి, రంగులు పూసుకుని, నగలు వ్రేలాడదీసుకుని మోహా పెట్టే నీ నుండి మానవాళికి ముక్తి ఎప్పుడో!' అని అనుకుంటూ ఉంటే, బహుశా ఆమె 'మీవల్ల నా కెప్పుడూ ఉపకారమే జరుగుతూంది' అని అనుకుంటున్నదేమో శ్రీరామమూర్తికి తెలియదు. అతడు మాత్రంఆమెను మరి చూడ కోరడు. ★